


అది ప్రముఖ రచయిత 'మధురశ్రీ' సన్మాన సభ!

విద్యుద్దీపాలతో, కళాప్రియులతో సభ కళకళలాడి పోతోంది. బెలూన్లకు గాలి కొట్టినట్టుగా, ఎవరి శక్తికొద్దీ వాళ్లు 'మధురశ్రీ'ని పుబ్బేస్తున్నారు. కొన్నిబెలూన్లు మధ్య లోనే తుస్సుమంటున్నాయి!

'మధురశ్రీ'కి అంతకుముందే పది సన్మానాలు జరిగాయి. విశేషమేమిటంటే, సొంతవూళ్లో అది తొలి సన్మానం!

'సంఘంలో పరపతి పెంచుకోవటం ఎలా?' 'ఉద్యోగ విజయాలకు సులువైన చిట్కాలు,' 'జనాన్ని ఆకొట్టుకో వడం ఎలా?,' 'జీవితంలో పైకిరావాలంటే'' వంటి సబ్జెక్టుల పైన 'మధురశ్రీ' రాసిన పుస్తకాలు జనంలో పెద్ద సంచలనం సృష్టించాయి. దాంతో నలభై యేళ్ల 'మధురశ్రీ'ని చూసి, అందరూ 'ఆహా... ఈయన జీవితంలోని మెళకువలన్నీ ముందే వడ్బేసివుంటాడు. ఎన్ని గొప్ప చిట్కాలు రాస్తున్నాడు' అని మెచ్చుకోవడం ఆరంభించారు.

సన్మాన తతంగం పూర్తికాగానే, 'మధురశ్రీ' ఉపన్యసిస్తాడని అధ్యక్షుడు ప్రకటించాడు. అంతా నిశ్శబ్దం...

''మన జీవితం బాగోగులు మనచేతుల్లో వున్నాయి. మనం విజయం సాధించడం అనేది మనం ఇతరులను ఆకట్టుకోవడంలో వుంది. చల్లనిమాటల్లో మీ ఆప్యాయతను ప్రకటించండి. మీ ముఖం మీద చిరునవ్వు అనే దీపాన్ని ఎప్పుడూ వెలిగించండి. అంతే... మీ చుట్టూవున్న చీకటి పటాపంచలవుతుంది...'' ఇలా కరతాళధ్వనుల మధ్య సాగింది—'మధురశ్రీ' ప్రసంగం.

ఆ సన్మాన సంఘం కార్యదర్శి కృష్ణమూర్తికి—ఆయన ఉపన్యాసం వినగానే అంతకుముందున్న గౌరవంకాస్తా యినుమడించింది. సభ అయిపోగానే, తనే ఆయన్ను ఇంటివద్ద 'డ్రాప్' చేస్తానని కారుదగ్గరకు తీసుకువచ్చాడు. సభలో ఆయనకు వేసిన దండలు, పుష్పగుచ్ఛాలూ పట్టుకుని ఓ కార్యకర్త—వాటిని ఆ కార్లో పడేశాడు.

''అబ్బే... మీకెందుకు శ్రమ... నేను టాక్సీలో వెళ్తానండీ'' అన్నాడు 'మధురశ్రీ' చిరునవ్వులు చిందిస్తూ.

''అ... ఎంతమాట... మిమ్మల్ని మీ ఇంటిదగ్గర 'డ్రాప్' చేయడంద్వారా మీ ఇల్లు చూసినట్లు అవుతుంది. అదీగాక మీరు ఆ మధ్య రాశారు చూడండి. 'ఇతరులను ఆకట్టుకోవడం ఎలా?' అని. ఆపుస్తకం నా దగ్గరలేదు. అది మీ సంతకంతో—మీ దగ్గర్నుంచి తీసుకుంటే, నాకోతృప్తి. అంచేత మిమ్మల్ని 'డ్రాప్' చేయడంలో నా స్వార్థం కూడా వుంది లెండి'' అని తన 'జోకు'కు తానే మురిసిపోతూ, పెద్దపెట్టున నవ్వాడు కృష్ణమూర్తి.

మరేమీ మాట్లాడకుండా 'మధురశ్రీ' కార్లో కూర్చున్నాడు. కృష్ణమూర్తి కారు డ్రైవ్‌చేస్తూ, దారిపొడుగునా ఆయన్ని పొగుడుతూనే వచ్చాడు.

ఇల్లు రానేవచ్చింది. సారీ... కారు ఇంటిదగ్గరకు వచ్చింది. కృష్ణమూర్తి పట్టువదలని విక్రమార్కుడిలా, పిలవకపోయినా 'మధురశ్రీ' వెంటవస్తూ, హాల్లో కూర్చున్నాడు. 'మధురశ్రీ' కార్లోని దండలూ, పుష్పగుచ్ఛాలూ మోసుకుంటూ, లోపలికి వెళ్లారు 'ఇప్పుడే వస్తానంటూ'.

''ఏమిటీ... ఇప్పుడా రావడం... సభలు, సన్మానాలు, చట్టుబండలూ అంటూ—తిరగడమేకానీ దమ్మిడీ ఆదాయంలేదు. ఒక ఉద్యోగం. లేదు ఏదేదో చెత్తరాతలు రాస్తావు. ఆ పబ్లిషర్లు సరిగ్గా డబ్బులిచ్చి ఏడవరు. అవేవో దయ్యాల నవలలు, అవీ రాస్తే ఎక్కువ డబ్బు వస్తుందట కదా... అవిరాయ వచ్చుకదా దీనికితోడు నీ చుట్టాలసంత... పొద్దున్ననగా వచ్చి తగలడ్డారు. వాళ్లకి నానా చాకిరీ చెయ్యలేక చస్తున్నాను. నిన్ను పెళ్లి చేసుకున్నందుకు బాగా సుఖపడుతున్నానులే... ఆ పూలదండలెందుకు లోపలకు తెచ్చావ్... బయట పారేయక.''

గట్టిగా కేకలు...

చర్రున ఏదో చిరిగిన శబ్దం... దబ్‌దబ్‌మన్న చప్పుళ్లు.

హాల్లో కూర్చుని, అంతావింటున్న కృష్ణమూర్తికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. మరో ఐదునిమిషాలకు 'మధురశ్రీ' ఆదరాబాదరాగా వచ్చాడు. ఆయన మరోదుస్తుల్లో వుండడం గమనించాడు కృష్ణమూర్తి.

''సారీ... కృష్ణమూర్తిగారూ... 'ఇతరులను ఆకట్టుకోవడం ఎలా?' అనే పుస్తకం కాపీ ఒక్కటికూడా కనిపించడంలేదు. నేను ఎక్కడినుంచయినా తెప్పించి, మీకు పంపిస్తాను... మా ఆవిడ ఆరోగ్యం అంతబాగోలేదు. మరోసారి తీరుబాటుగా మాట్లాడుకుందాం... సారీ...'' అని చిరునవ్వులు చిందిస్తూ చెప్పారు మధురశ్రీ.

''ఆ... ఆ... అర్థమైంది. నో ప్రోబ్లమ్ సార్... దాందేముంది... పుస్తకం లేకపోయినా, మీ చిట్కాల్లోని రహస్యం నాకు బాగా అర్థమైపోయింది'' అని వెనక్కితిరిగి చూడకుండా కారువైపు పరుగుతీశాడు కృష్ణమూర్తి.

—ధరణి

అనుకొన్నా ఉన్న యథార్థ్యం అది. దానిని అంగీకరించని పక్షంలో, పురుషుని కామాచారం కూడా ఎక్కువ తప్పే అనవచ్చును గాని, స్త్రీ కామాచారం తక్కువ తప్పు అనడానికి వీలులేదు.

ఇంకొక్క పెద్ద విషయం ఉన్నది. అది వివాదగ్రస్తం ఐతే కావచ్చును గాని, అవజ్ఞచేయదగినది మాత్రం కాదు. 'ప్రామిస్క్యుయిటీ' కి అవకాశం పురుషులలో కంటే స్త్రీలలో హెచ్చు. ఇట్లా అనడానికి రుజువేమైనా ఉన్నదా అంటే, గమనించండి; దుస్తులను సాధ్యమైనంత వరకు తగ్గించి శరీర అంగప్రత్యంగాలను ఎగ్జిబిషన్‌కు పెట్టాలనే కాంక్ష స్త్రీలలోనే ఉన్నది, స్వాభావికంగానే ఉన్నది; 'ఉన్నదంటే ఉండేదీ లేదంటే లేకపోయేదీ' కాదు. ఇది అందుకు రుజువని చెప్పవచ్చును. మరొకటి కూడా ఉన్నది. కాని దానిని స్పష్టంగా చెప్పడానికి సభ్యతాసీమను దాటవలసి వస్తుందేమో అని సంకోచించవలసి వస్తోంది. హేతువాద దృష్టితో పరిశీలించుకుంటే, జ్ఞాతాస్వాదులందరికీ తెలియవచ్చును.

కాగా, సారాంశం ఏమిటంటే, నియమనిబంధన లేమీ లేకుండా తిరుగ గలగాలని వనితల కోరిక. అటువంటి నడువడికి సంఘంలో కొంతైనా అభ్యంతరం ఉండవలసి వస్తోంది. ఈ విషయాలన్నీ గమనించక, స్త్రీ స్వాతంత్ర్య వాదినులు వారిని బట్టి వీరూ, వీరిని బట్టి వారూ విజృంభించి హద్దు లేకుండా ప్రచారం చేస్తే, అమాయక సాధారణ స్త్రీలలో అవినయం, అవిధేయత పెరిగి, కుటుంబ సౌమనస్యాలను నాశనం చేయడానికి మాత్రం ఉపయోగపడతాయి. కనుక, విద్యావతులయిన 'వుమెన్స్ లిబ్'-మహిళామణులు 'మేల్-షొవినిజమ్' ను గూర్చిన తమ విమర్శలను, తమ హక్కుల ఉద్ఘాటనను హద్దులో ఉంచుకోవాలి. □

— చివుకుల వేంకట సుబ్బావధానులు